క్లుప్తంగా...

చికెన్ వ్యాపారుల ధర్నా



రామంతాపూర్: చికెన్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు స్థానిక ఏడీఆర్ఎం ఆస్పత్రి ఎదురుగా నూతనంగా భారీ చికెన్ వ్యాపార సంస్థ ప్రారంభించబోయే చికెన్ షాప్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా నేతలు వరుణ్ యాదవ్, అనంతరెడ్డి మాట్లాడుతూ స్థానికంగా నిరుద్యోగ యువకులు చిన్న చిన్న చికెన్ సెంటర్లను ఏర్పాటు చేసుకుని జీవితం వెల్లదీస్తున్నారని, అదేవిధంగా చికెన్ షాప్‌లను పక్కపక్కనే పెట్టకూడదనే నిబంధన కూడా పాటిస్తూ ఉన్నామని ఆ నిబంధన అతిక్రమించి ఒక పెద్ద వ్యాపార సంస్థ హోల్‌సేల్ చికెన్ షాప్‌ను ప్రారంభించడంతో చిన్న చికెన్ షాపులన్నీ మూతపడే అవకాశం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఈషాపును ఈ ప్రాంతంలో ప్రారంభించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పలువురు చికెన్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ధర్నాకు అనుమతించాలని వినతి



మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

కాప్రా: ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం చేపట్టే ధర్నాకు అనుమతి ఇవ్వాలని కాప్రా సర్కిల్‌లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు కోరారు. ఈ విషయంపై గురువారం సర్కిల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్నామని, సమ్మెకు మద్దతుగా రాష్ట్ర కార్మిక సంఘం పిలుపు మేరకు శుక్రవారం కాప్రా సర్కిల్ కార్యాలయం ఆవరణలో చేపట్టే సమ్మెకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

10 నుంచి హోమియోపతిక్ జాతీయ సదస్సులు

ఉప్పల్: 10వ తేదీ నుంచి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ జాతీయ సమావేశాలు, సెంటిఫిక్ సెమినార్లను నిర్వహిస్తున్నట్లు ఐఐహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఎంఎన్ రాజు తెలిపారు. ఈ నెల 10 నుంచి 11 తేదీ వరకు రెండు రోజుల పాటు నగరంలోని సత్య సాయి నిగమాగమంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ, జాతీయ హోమియోపతిక్ వైద్య నిపుణులు పాల్గొని హోమియో వైద్యం ద్వారా సాధించిన విజయాలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ తదితర అంశాలపై చర్చలు ఉంటాయన్నారు. ఐఐహెచ్‌పీ ఆర్గనైజింగ్ సెక్రటరీ హోమిపతి వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.లింగరాజు, కార్యదర్శి డా.మహేష్. పగడాల మధు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న హోమియోపతి వైద్యులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉప్పల్‌లో 3,733 ఓటర్లు తగ్గారు

ఉప్పల్: ఉప్పల్ నియోజవర్గం ఫైనల్ ఓటరు లిస్టును అధికారులు గురువారం ప్రకటించారు. దీని ప్రకారం అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటికి పెరగాల్సిన ఓటర్లు దాదాపుగా 3,733 వరకు ఓటర్లు తగ్గారు. మొత్తం ఓటర్లు గురువారం వరకు 5,29,416 ఉన్నారని అందులో మహిళలు 2,54,147, పురుషులు 2,75,229 ఇతరులు 38 వరకు ఉన్నట్లు ప్రకటించారు. గతంలో ప్రకటించిన చివరి ఓటరు లిస్టు ప్రకారం 5,33,149 ఓటర్లు ఉండగా మహిళలు 2,56,221, పురుషులు 2,76,890 ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. 3,733 ఓటర్లు తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు.

శ్రీదర్శిని హోటల్‌లో తనిఖీలు

మేడ్చల్: పట్టణంలోని శ్రీదర్శిని హోటల్‌లో మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. శ్రీదర్శిని హోటల్ ఆహారంలో బొద్దింక ఉందన్న విషయం న్యూస్‌లో ప్రచురితమైన విషయం విధితమే. ఈమేరకు గురువారం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ తన సిబ్బందితో కలిసి హోటల్‌ను పరిశీలించారు. హోటల్ నిర్వహణలో యాజమాన్యం పరిశుభ్రతను పాటించడంలేదని నోటీసులు జారీ చేసినట్లు శంకర్ తెలిపారు. నోటీసుకు వివరణ వచ్చిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సత్యనారాయణ కాలనీ అభివృద్ధికి సహకరిస్తా

కీసర: సత్యనారాయణ కాలనీ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏర్పడిన సందర్భంగా నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డిని కమిటీ సభ్యులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త కమిటీ ఉత్సాహంగా పనిచేయాలని, కాలనీ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తానని చెప్పారు. చైర్మన్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కమిటీ సభ్యులు ఉన్నారు.

సమ్మర్.. నో వాటర్ ప్రాబ్లమ్

- వేసవిలో తాగునీటి సరఫరా సాఫీగా సాగేలా..
- ఎక్కడ ఏ సమస్య ఉన్నా సత్వర పరిష్కారం
- అత్యాధునిక టెక్నాలజీతో లీకేజీల గుర్తింపు
- సమస్యా..? 155313కు సమాచారం ఇవ్వండి
- సెలవులు లేకుండా.. మూడు షిఫ్ట్‌ల్లో సిబ్బంది



ఉప్పల్ హైకోర్టు కాలనీ రిజర్వాయర్



ఉప్పల్ డివిజన్ జనరల్ మేనేజర్ సంతోష్

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో తాగునీటి ఎద్దడి రాకుండా పక్కా ప్రణాళికతో జలమండలి అధికారులు ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికే సిబ్బంది ద్వారా సమస్య ఉండే ప్రాంతాలను గుర్తించి చర్యలు సిద్ధం అవుతున్నారు. కలుషిత జలాలు సరఫరా అయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక యంత్రాల ద్వారా సమస్యను గుర్తించి చర్యలకు ఉపక్రమించారు. నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా, లీకేజీలను అరికడుతున్నారు. బస్తీలు, కాలనీల్లో ఎక్కడా తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. డిమాండ్‌కు సరిపడా నీటి సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

- ఉప్పల్ జలమండలి డివిజన్ పరిధిలో కాప్రా ఉప్పల్ సర్కిళ్లలో కలిపి 75,552 నీటి కనెక్షన్లు ఉన్నాయి. నియోజకవర్గంలో 904 కిలోమీటర్ల మేర నీటి పైపులైన్ విస్తరించి ఉంది. 22 రిజర్వాయర్ల ద్వారా దాదాపు 96 ఎంఎల్‌డీ నీటిని ప్రతినిత్యం సరఫరా చేస్తున్నారు.

ఓఆర్ఆర్ ఫేజ్–2 ద్వారా..

ఓఆర్ఆర్ ఫేజ్–2 ప్రాజెక్టు ద్వారా అదనంగా మరో 90 కిలో మీటర్ల మేర నీటి కనెక్షన్లు అందజేస్తున్నారు. ఇప్పటికే కాప్రా, ఉప్పల్ సర్కిళ్ల పరిధిలో దాదాపు 60 కిలో మీటర్ల మేర నీటి పైప్ లైన్లు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా వచ్చే రెండు నెలల కాలంలో పూర్తి చేస్తామని, దీనివల్ల ఎప్పటికీ నీటి సమస్య రాదని అధికారులు అంటున్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా..

ఉప్పల్ నియోజకవర్గంలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జనరల్ మేనేజర్ సంతోష్ తెలిపారు. ప్రత్యేకంగా బస్తీల్లో మరింత జాగ్రత్త పడుతున్నాం. సిబ్బంది మూడు షిఫ్ట్‌ల్లో సెలవులు లేకుండా పని చేస్తున్నారు. ఎక్కడ కలుషితమైన నీరు వస్తున్నా వెంటనే ఆధునిక టెక్నాలజీతో కనిపెట్టి అప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నాం. అక్రమ కనెక్షన్లు ఉన్న వారు వాటినే దరఖాస్తు ద్వారా రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం ఉంది. ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్య ఉన్నా 155313కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

ఆత్మవిశ్వాసంతో విజయం సాధించాలి



స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో గురువారం శ్రీసత్య సాయి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ గడ్డం సాయికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆగమ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు, చదువులో కానీ ఇతర అనేక రంగాల్లో వెనుకబడినా చింతించకుండా ఆత్మవిశ్వాసంతో విజయం సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. మూడు రోజులు జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 10వ తేదీన ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామని గడ్డం వెంకట్ సాయి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్‌నేత గంధం నాగేశ్వర్‌రావు, పసుల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి..!

- 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదనలు సిద్ధం
- 61 పంచాయతీల్లో రూ.5.30 కోట్లతో పనుల గుర్తింపు
- 17,832 జాబ్‌కార్డులు.. 1.71 లక్షల పనిదినాలపై నివేదిక



సాక్షి, మేడ్చల్ జిల్లా: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి 1.71 లక్షల పనిదినాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటికి సంబంధించి రూ.5.30 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇటీవల గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించారు. అయితే ప్రతిపాదించిన వాటిని కేంద్రానికి పంపించగా.. వారు అందులో ఎన్ని రోజులకు కుదిస్తారో తెలియాల్సింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా 17,832 జాబ్ కార్డులు ఉన్నాయి. 61 పంచాయతీల్లో ఇటీవలే గ్రామసభలు పూర్తి చేశారు. కూలీల నుంచి వచ్చే డిమాండ్ ఆధారంగా పనుల గుర్తింపు ప్రక్రియ కొనసాగింది. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ కింద ఎక్కువగా హరితహారం, ఇంకుడు గుంతలు, రైతు కల్లాలు, బృహత్ ప్రకృతి వనాలు, చెరువుల్లో పూడికతీత తదితర పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. చాలా గ్రామాల్లో కూలీలు, రైతులు వీటికి సంబంధించే పనులు అడిగారు. మౌలిక సదుపాయాల కింద వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, వినియోగంలో లేని రోడ్లు బాగుచేయడం, పాడుబడిన బావులు పూడ్చివేత, హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం కోసం గుంతలు తీయడం, కంచెల నిర్మాణం, మొక్కలకు నీరు పోసే పనులు నిరంతరం కొనసాగించాలని అత్యధికులు తీర్మానించినట్లు తెలుస్తోంది.

అందరూ దృష్టి సారిస్తేనే..

ఉపాధి హామీ పనులు కొనసాగే సమయంలో ఏమాత్రం పర్యవేక్షణ కనిపించడం లేదు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు మాత్రమే పర్యవేక్షణ చేస్తున్నారు. అధికారులతో పాటు స్థానికులు ఉపాధి పనులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గతేడాది పనులిలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఘట్‌కేసర్, కీసర, మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలో మొత్తం జాబ్ కార్డులు 19,350 ఉండగా, ఇందులో ఎస్టీ జాబ్ కార్డులు 1500, ఇతర కులాల వారి జాబ్ కార్డులు 13,610 ఉన్నాయి. ఈ జాబ్ కార్డులకు సంబంధించి కూలీలు 21,586 మంది ఉన్నారు.

బస్తీ దవాఖానాలను పరిశీలించిన బీజేపీ నాయకులు



బస్తీ దవాఖానాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కీసర: నాగారం మున్సిపాలిటీలోని బస్తీ దవాఖానాలను బీజేపీ నాయకులు గురువారం పరిశీలించారు. దవాఖానాలకు వచ్చిన రోగులతో మాట్లాడి అక్కడి సమస్యల గురించి తెలుసుకున్నారు. 5, 16 వార్డుల్లోని దవాఖానాల్లో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో సమస్యను కీసర ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ సరితకు వివరించారు. వైద్యులను అందుబాటులో ఉంచడంతో పాటు ఇతర సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరిస్తామని సరిత హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి, కేశవరెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, గంధ్ర కమలాకర్, మల్రెడ్డి సతీష్‌రెడ్డి, అఖిల్, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులకు భూమిపూజ చేస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో కొత్తగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు కౌన్సిలర్ చింతల రాజశేఖర్ చెప్పారు. గురువారం మూడో వార్డులోని ఎల్‌ఐజీ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ పనులను ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.10 లక్షల మున్సిపల్ నిధులతో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య నిలయంపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: అనుమతి లేకుండా సంపూర్ణ ఆరోగ్య నిలయంలో వైద్యం అందిస్తున్నారని ఆరోపిస్తూ సంపూర్ణ ఆరోగ్య నిలయంపై జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రఘునాథ స్వామికి గురువారం ఫిర్యాదు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, కోఆప్షన్ సభ్యులు షౌకత్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, కృపానిధి, సునీల్, ప్రణయ్‌రెడ్డి, సిరాజ్ ఉన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వేముల మారయ్య

మల్లాపూర్: ఆటో డ్రైవర్లకు జీవన భృతి కింద నెలకు రూ.15 వేలు ఇవ్వాలని కోరుతూ గురువారం రవణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలంగాణ ఆటో మోటార్స్, డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య వినతి పత్రం అందజేశారు. ఈఎస్ఐతో కూడిన ఆటో మోటార్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు ఓలా, ఉబర్, ర్యాపిడోలను నిషేధించాలని మంత్రిని కోరారు. ప్రభుత్వమే ఒక యాప్‌ను తయారు చేసి ఆటో డ్రైవర్లకు అందజేయాలని, కొత్త ఆటోలకు పర్మిట్లు ఇచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, ఆటో యూనియన్ నాయకులు నిరంజన్, రామకృష్ణ, దాసు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మోదీ సర్కార్



కీసరలో ప్రముఖులతో ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి

కీసర: దేశంలో మరోసారి మోదీ సర్కార్ ఏర్పడాలని ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం కీసరలో ప్రముఖ వ్యక్తులను కలిసి ప్రధాని మోదీకి మద్దతు తెలపాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాగుల అశోక్ ముదిరాజ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నల్ల వెంకట్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు శేఖర్ ముదిరాజ్, కీసర బూత్ అధ్యక్షుడు చిక్కుడు సత్యనారాయణ, రామ్ నర్సింహులు, చంద్రమౌళి, పెద్దుల్ ముదిరాజ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



జవహర్‌నగర్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న శంకర్‌గౌడ్, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 28వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ స్థానిక వికలాంగుల కాలనీ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డిని దూషించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ముఖ్యఅతిథులుగా జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్, స్థానిక కార్పొరేటర్ నిహారికగౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఐలయ్య, చెన్నారెడ్డి, రాజుయాదవ్, దయాకర్‌చారి, యాకచారి, అశోక్, దేవేందర్, భరత్, రాములు, వెంకన్న, వీరస్వామి, భాస్కర్‌గౌడ్, నరేశ్, రమేశ్, రవి, సుజాత, ఉమారాణి, గంగ, స్వరూప పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లాలో 28,75,907 మంది ఓటర్లు



సాక్షి, మేడ్చల్ జిల్లా: సవరించిన తుది ఓటరు జాబితాపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం డీఆర్ఓ హరిప్రియతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2024 ప్రకారం నమోదులు, తొలగింపుల అనంతరం జిల్లాలో సవరించిన ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. జిల్లాలో 28,75,907 మంది ఓటర్లుగా నమోదయ్యారని ఆయన తెలిపారు. 10,264 మంది యువత కొత్తగా ఓటర్ జాబితాలో చేరినట్లు తెలిపారు. ఇందులో సర్వీస్ ఓటర్లు 715 మంది, దివ్యాంగులు, 26,207, పురుషులు 1,48,3448 మంది, మహిళలు 13,92,074 మంది, ట్రాన్స్‌జెండర్ 385 మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. 80 సంవత్సరాల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు చేసుకుంటే వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటివద్దే ఓటు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించాలని పార్టీ ప్రతినిధులు కోరగా, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం తొలగించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ఫస్ట్ లెవెల్ చెకింగ్‌లో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్, బ్యాలెట్ బాక్స్ పనితీరును అదనపు కలెక్టర్‌తో కలిసి రాజకీయ పార్టీ ప్రతినిధులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్రెడ్డి, పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆద్రాస్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలతో ఊపిరితిత్తులు ఇతర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో 125 మందికి పరీక్షలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఒమర్, అపూర్వ, శ్రీయ, వైద్య సిబ్బంది, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గాంధీ, పటేల్ విగ్రహాల వద్ద గ్రీనరీ ఏర్పాటు చేయాలి



డీఈ మహేష్‌తో మాట్లాడుతున్న శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి గాంధీ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం, సర్దార్ వల్లభాయి పటేల్ నగర్‌లో ఏర్పాటు చేసిన వల్లభాయి పటేల్ విగ్రహం వద్ద గ్రీనరీతో పాటు లైటింగ్ ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ డీఈ మహేష్‌ను కోరారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో డివిజన్‌లో ఉన్న పెండింగ్ పనులు వాటి పురోగతి గురించి ఆరా తీశారు. నిధులు మంజూరైనా వాటిలో జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరామన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి



స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రోటోకాల్‌తో పాటు గతేడాది డిసెంబర్ నెలలో తన నంబర్ నుంచి తన ప్రమేయం లేకున్నా యాప్ ద్వారా బెదిరింపు కాల్స్ చేయడంపై జరుగుతున్న దర్యాప్తు వివరాలను ఆయనకు వివరించారు. రాజశేఖర్‌రెడ్డితో పాటు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఉన్నారు.

మురికివాడల అభివృద్ధికి ప్రాధాన్యం

– కార్పొరేటర్ శ్రీవాణి



నెహ్రూనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్, అధికారులు

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో గురువారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్ఎంసీ మురికివాడల అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నెహ్రూనగర్‌ను అధికారులు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. దీంతో నెహ్రూనగర్‌లో అన్ని మౌలిక వసతులు కల్పించి ఏ సమస్యలు లేని ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ నాగమణి, ఎ.శ్వేత శ్రీధర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్‌రావు, కుమార్, స్వామి, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



అల్వాల్: నేరేడ్‌మెట్ సీఐగా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సందీప్‌కుమార్‌ను మేడ్చల్–మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మోమిన్‌భాష ఆధ్వర్యంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆశ, నరసింహాగౌడ్, గిరి యాదవ్, రహీమ్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగదారులకు జరిమానా



ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని, జరిమానా విధిస్తున్న అధికారులు

పోచారం: నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న ఎస్‌వీడీ వైన్స్ యజమానికి మున్సిపల్ అధికారులు రూ.2 వేల జరిమానా విధించారు. అన్నోజిగూడలో ప్లాస్టిక్ నిషేధంపై కమిషనర్ వేమనరెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను వినియోగదారుల నుంచి పెద్ద సంఖ్యలో స్వాధీనం చేసుకున్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి

కీసర: మండల పరిధిలో బోగారంలో కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా స్పర్శ్ లెప్రసీపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంటరానితనాన్ని అంతం చేయడం, సమాజంలో గౌరవాన్ని స్వీకరించడం అనే నినాదాలతో ప్రచారం చేశారు. అవగాహన కార్యక్రమం ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగుతుందని వైద్య, ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు శ్రీరామ, ఇందిర, ఆశా కార్యకర్తలు వినోద, పుష్పలత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.